సాక్షి
మంచిర్యాల
సోమవారం । 17 । మార్చి । 2025



పట్టుబట్టి.. కొలువు కొట్టి 8లో▸
టీజీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన గ్రూప్–1, 2, 3 ఫలితాల్లో ఉమ్మడి జిల్లావాసులు సత్తా చాటారు. ఉన్నతస్థాయి కొలువు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు ఆమేరకు కష్టపడ్డారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:22	మంగళ : 5:06

గరిష్టం/కనిష్టం
39.5 /24.4

వాతావరణం
ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. గాలిలో తేమ శాతం తగ్గుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి

• డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



నిరసనలో కొక్కిరాల సురేఖ, నాయకులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ డిమాండ్ చేశారు. టీ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. ప్రజాసమస్యలను చర్చించాల్సిన అసెంబ్లీలో సభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సుపరిపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసుతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.

బాలకృష్ణ ప్రసాద్‌కు నివాళి

మంచిర్యాలఅర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకుడు, 800 అన్నమయ్య కీర్తనలకు స్వర రచన, లలిత గీతాలు రచించి స్వరపరిచిన అభినవ అన్నమయ్య గర్మిళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభ మంచిర్యాలలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం నిర్వహించారు. సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలకృష్ణప్రసాద్‌కు నివాళులర్పించారు. 1978 నుంచి 2006 వరకు అన్నమాచార్య ప్రాజెక్టు ద్వారా సంగీతం, పరిశోధన, ప్రచురణ, ప్రచారం కోసం అన్నమయ్య సాహిత్యానికి విశేష సేవలు అందించి అనేక కృతులకు సొంత బాణీలు కూర్చారని కొనియాడారు. సంస్మరణ సభలో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారకుడు చంద్రశేఖర్, సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కవులు సుగుణాకర్, నగేష్, సంతోష్, విశ్వేశ్వరశర్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహితలో అరుదైన చేప



వేమనపల్లి: ఎన్నో జలచరాలకు నిలయమైన ప్రాణహిత నదిలో జాలరులకు ఆదివారం ఓ అరుదైన చేప చిక్కింది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన ఎల్లెల శ్రీనివాస్, ఎల్లెల గంగాధర్ ప్రాణహితలో చేపల వేటకు వెళ్లారు. దడంగి(పెద్దవల) వేయగా పెద్ద పులుసు, రొవ్వు చేపలతోపాటు మూడున్నర కిలోల నలుపు రంగు చేప దొరికింది. దీనిపేరు బొట్టు పిల్ల అని జాలర్లు తెలిపారు. కొందరు రాక్షసిచేప, మంగారా అని పిలుస్తారని పేర్కొన్నారు. దీనికి పొలుసులు ఉండకపోగా నలుపు, తెలుపు వర్ణంలో ఉంది. దీని మాంసం రుచితో పాటు ఆరోగ్యానికి మంచిదని తెలిపారు.

కరెన్సీ ప్రదర్శన



కరెన్సీ ప్రదర్శిస్తున్న రవికుమార్

వేమనపల్లి: నీల్వాయి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం ప్రపంచ దేశాల కరెన్సీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కరెన్సీ ఔత్సాహికుడు రవికుమార్ 120 దేశాల నుంచి సేకరించిన పురాతన, అధునాతన కరెన్సీలను ప్రదర్శనకు ఉంచారు. డబ్బు విలువ, కరెన్సీ రూపొందించే విధానం వివరించారు. టిప్పుసుల్తాన్ కాలంనాటి కరెన్సీతోపాటు చెలామణిలో ఉన్న నాణేల ఆవశ్యకతను వివరించారు. ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, పీఈటీ మల్లేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వేడి.. తగ్గేలా..



అద్దె భవనంలో కొనసాగుతున్న ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

• ఒంటిపూట నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం
• ఉత్తర్వులు జారీ చేసిన శిశు సంక్షేమ శాఖ
• స్వాగతిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు

మంచిర్యాలటౌన్: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే భానుడు భగ్గుమంటున్నాడు. మార్చి రెండో వారంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ప్రభుత్వం చిన్న పిల్లలు వేడితో ఇబ్బంది పడకుండా మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తోంది. అయితే పాఠశాల విద్యార్థులకన్నా చిన్న పిల్లలు ఉండే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపైనా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరుకు గదుల్లో, ఫ్యాన్లు లేక వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యే చిన్నారులకు ఉపశమనం కలిగించే నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఒంటిపూట నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఏటా పాఠశాలలను మాత్రమే హాఫ్‌డే నిర్వహించే ప్రభుత్వం ఈసారి అంగన్‌వాడీ కేంద్రాలను కూడా నిర్వహించాలని నిర్ణయించింది. మార్చి 15వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఒంటిపూట నిర్వహించాలని రాష్ట్ర మహిళా, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతి వెస్లే ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం పిల్లలను ఇళ్లకు పంపిస్తారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మొత్తం కేంద్రాలు	969
పక్కా భవనాలున్నవి	169
పాఠశాల, ఇతర భవనాల్లో ఉన్నవి	316
అద్దె భవనాల్లో ఉన్నవి	484

కేంద్రాలకు వచ్చేవారి వివరాలు..

గర్భిణులు	4,245
బాలింతలు	3,186
చిన్నారులు	45,455

ఉక్కపోత నుంచి ఊరట..

జిల్లాలో చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కాభవనాలు లేవు. జిల్లావ్యాప్తంగా 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, కేవలం 169 కేంద్రాలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయి. 316 కేంద్రాలను ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. 484 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో కనీస వసతులు లేవు. వేసవిలో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చాలా మంది తమ పిల్లలను కేంద్రాలకు పంపడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఒంటిపూట నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో చిన్నారులకు వేడి, ఉక్కపోత నుంచి ఉపశమనం లభించనుంది.

వసతులను కల్పిస్తేనే..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది. కేంద్రాల్లో సౌకర్యాలు లేక, వేసవిలో పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలు కూడా వేడి, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిలో ఎక్కువగా రేకుల షెడ్లు, వరండాలు, ఇరుకు గదుల్లోనే ఉన్నాయి. కేంద్రాల్లో ఫ్యాన్లు లేవు, ఉన్నవి సరిపడా పని చేయడం లేదు. తగినంత గాలి, వెలుతురు గదుల్లోకి రాకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వేడి తట్టుకోలేక పోతున్నారు. మార్చి నెలలోనే మాడు పగిలేలా ఎండలు దంచి కొడుతున్నాయి. వేడి గాలులు వీస్తున్నాయి. ఎండ వేడి, ఉక్కపోతతో చిన్నారులు, గర్భిణులకు ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయని, తగిన జాగ్రత్తలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవికాలం ముగిసే వరకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు ఏర్పాటు చేయడం, పనిచేయని వాటికి మరమ్మతులు చేయించడం, సరైన వసతులు కల్పిస్తే అందరికీ ఇబ్బందులు తొలగుతాయని కేంద్రాలకు వచ్చే గర్భిణుల, బాలింతలు పేర్కొంటున్నారు.

ఒంటిపూట నిర్వహణకు ఉత్తర్వులు



అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించేందుకు రాష్ట్ర మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ ఉత్తర్వులను జారీచేసింది. పెరిగిన ఎండలు, నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఈ నెల 15 నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో చిన్నారులకు కొంత ఇబ్బంది తగ్గుతుంది.

– రవూఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

‘టెన్’షన్ వద్దు

• ఒత్తిడికి లోనుకావొద్దు..
• ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాలు
• ఈ ఏడాది బుక్‌లెట్ రూపంలో ఆన్సర్ షీట్
• ‘పది’ విద్యార్థులకు డీఈవో యాదయ్య సూచన



డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: మరో ఐదు రోజుల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా సదుపాయాలు కల్పిస్తున్నామని డీఈవో యాదయ్య తెలిపారు. ఎలాంటి టెన్షన్ లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ఆరోగ్యం విషయంలోనూ జాగ్రత్త వహించాలని తెలిపారు. పరీక్షల్లో పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ, ఈ ఏడాది కొత్తగా అమలు చేస్తున్న విధానాలు, కేంద్రాల్లో సౌకర్యాలపై ‘సాక్షి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించారు..?

డీఈవో: విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాగునీటితోపాటు ఫ్యాన్లు, ఫర్నిచర్, డ్యూయల్ డెస్క్ అందుబాటులో ఉన్న పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశాం. ప్రతీ సెంటర్‌లో చల్లని తాగునీరు అందుబాటులో ఉంచుతాం. ప్రతీ సెంటర్‌లో ఏఎన్‌ఎంతోపాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుతాం. అన్ని కేంద్రాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల వేళ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తాం.

సాక్షి: పరీక్ష విధానంలో ఈ ఏడాది తీసుకువచ్చిన మార్పులు ఏంటి?

డీఈవో: ఈసారి కొత్త నిర్ణయాలు అమలు చేయనున్నాం. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 24 పేజీలతో కూడిన జవాబు పత్రం(అన్సర్‌షీట్) ఇవ్వనున్నారు. గతంలో నాలుగు పేజీలతో కూడిన బుక్‌లెట్ ఇచ్చేవారు. నాలుగు పేజీలు రాశాక విద్యార్థుల అవసరాన్ని బట్టి అదనంగా రెండు పేజీలతో కూడిన జవాబు పత్రాలు ఇచ్చేవారు. పిల్లల సమయం వృథా కాకుండా ఉండేందుకు 24 పేజీలతో బుక్‌లెట్ ఇవ్వనున్నారు. పరీక్షల సమయంలో ఇచ్చే ఓఎంఆర్ షీట్‌లో తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి. గతంలో ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ పరీక్షలు ఒకేరోజు 10 నిమిషాల వ్యవధిలో జరిగేవి. ఈ ఏడాది ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ పరీక్షలు వేర్వేరు రోజుల్లో జరుగనున్నాయి.

సాక్షి: పరీక్షలపై సందేహాల నివృత్తికి ఎవరిని సంప్రదించాలి?

డీఈవో: పరీక్షలకు సంబంధించి సందేహాల నివృత్తికి కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. ఏమైనా ఇబ్బందులు ఉంటే 70324 63114 నంబర్‌లో సంప్రదించాలి.

సాక్షి: ఉత్తీర్ణత శాతం ఎలా ఉండబోతుంది?

డీఈవో: పది ఉత్తీర్ణత పెంచడానికి పాఠశాలల్లో ఎవరి స్థాయిల్లో వారు కష్టపడ్డారు. విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేశాం. ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాం. 90 శాతానికిపైగా ఉత్తీర్ణత సాధిస్తారని ఆశాభావంతో ఉన్నాం.

సాక్షి: విద్యార్థులు, తల్లిదండ్రులకు మీరిచ్చే సూచనలు..?

డీఈవో: పరీక్ష రాసే విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాన్ని ఒకరోజు ముందే చూసుకోవాలి. పరీక్ష ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుంది. విద్యార్థులు పరీక్షకు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రాల్లోకి తీసుకురావొద్దు. భయం వీడి.. ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలి. పరీక్షల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఒత్తిడికి లోనుకాకుండా చూడాలి.

సాక్షి: జిల్లాలో పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత మంది, ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేశారు?

డీఈవో: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు 370 స్కూళ్లకు చెందిన 9,189 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. 4,725 మంది బాలురు, 4,464 మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. వీరికోసం 49 సెంటర్లు ఎంపిక చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో చీఫ్ సూపరింటెండెంట్లు–49 డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు–49, సీ సెంటర్ కస్టోడియన్స్–4, ఇన్విజిలేటర్లు 620 మందిని నియమించాం. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, 49 సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షిస్తాయి. సీసీ కెమెరాలు అమర్చాం.

అవసరం లేకున్నా ప్లేడేలు

• కిందిస్థాయి అధికారుల హవా
• మస్టర్ పడి వెళ్లిపోవడంపై కార్మికుల ఆగ్రహం



కాసిపేట 2ఇంక్లైన్ గని

కాసిపేట: సింగరేణిలో మస్టర్ పడి వెళ్లడం, విధులు తప్పించుకోవడం వదిలేయాలని, ప్రతీ కార్మికుడు ఉత్పత్తి, ఉత్పాదకతలో భాగస్వామి కావాలని సీఅండ్ఎండీ బలరామ్ సూచిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది. సాధారణ రోజుల్లో కొందరు మస్టర్ పడి వెళ్లిపోతున్నారు. ఇక సెలవు రోజుల్లో అవసరం ఉన్నవారికి మాత్రమే ప్లేడే ఇవ్వాలని. కానీ, అధికారులు, సూపర్‌వైజర్లు తమకు అనుకూలమైన వ్యక్తులకు ప్లేడేలు రాసి మస్టర్ వేసి ఇంటికి పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించే కార్మికుడికి వరుసగా మూడు ఆదివారాలు ప్లేడే కేటాయించినట్లు కార్మికులు పేర్కొంటున్నారు. సదరు కార్మికుడు ప్లేడే రోజు మస్టర్ పడి ఇంటికి వెళ్తున్నట్లు తెలిపారు. దీనిపై అతడి గురించి ఆరా తీసేందుకు మీడియా ప్రతినిధులు వెళ్లగా గనిపై కనిపించలేదు. దీంతో స్థానిక కార్మికులను అడగగా, మధ్యాహ్నం అతడిని అధికారులు పిలిపించినట్లు తెలిసింది. సదరు కార్మికుడు మూడు వారాలు మస్టర్ పడటం మినహా అవుట్ టైం పడిన సందర్భం లేదని గుర్తించారు. ఉన్నతాధికారులు అవుట్ టైం సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ జరిపించాలని కార్మికులు కోరుతున్నారు.

రెండు గనుల్లో ఇష్టారాజ్యం..

కాసిపేట, కాసిపేట 2 గనులలో మస్టర్ల విషయంలో ఇష్టారాజ్యం నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. కిందిస్థాయి అధికారులు కొందరికి మస్టర్ వేసి ఇంటికి పంపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఇష్టమైన వారికి ప్లేడేలు ఇస్తున్నారని అంటున్నారు. బాధ్యతగా పనిచేసే కార్మికులకు కూడా వరుసగా మూడు ప్లేడేలు ఇవ్వరని, జనరల్ మజ్దూర్‌కు మాత్రం వరుసగా ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అవసరం ఉన్న కార్మికులకే ప్లేడేలు కేటాయించాలని కార్మికులు కోరుతున్నారు. ఈవిషయమై గని మేనేజర్ లక్ష్మీనారాయణను వివరణ కోరగా, ఈవిషయం తనదృష్టికి రాలేదని తెలిపారు. వరుసగా మూడు ప్లేడేలు సాధ్యం కాదని వెల్లడించారు. కొందరు కార్మికులు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. విచారణ జరిపి వరుసగా మూడు మస్టర్లు ఇస్తే బాధ్యులపై చర్య తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పదు

• ఎస్సీ, ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న



రాజేశ్వర్ ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

జన్నారం: ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్‌లో బాదంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామెర రాజేశ్వర్–పద్మావతి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజన్న హాజరై రాజేశ్వర్ దంపతులను సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పరస్పర బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్, ఎస్సీ, ఎస్టీ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకటరావు, ప్రముఖ కవులు మురుమడుగుల రాజారావు, రాజేశ్వర్, ఎస్సీ ఎస్టీ టీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు బూక్య రాజేశ్‌నాయక్, పిట్ట మండల అధ్యక్షుడు తుంగూరు గోపాల్, జిల్లా, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ప్రకాశ్‌నాయక్, రాజారావు, ఎంఈవో విజయ్‌కుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమమౌళి పాల్గొన్నారు.

కాలువలో పూడిక తొలగింపు

సాక్షి స్పందన

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ పూడికతో నిండి పంటలకు సాగునీరు అందడం లేదు. దీనిపై ‘పూడిక తీయించండి’ శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. డీఈ వెంకటస్వామి ఆదేశాల మేరకు ఏఈ విష్ణు, కాంట్రాక్ట్ కంపెనీ మేనేజర్ మల్లి కార్జున్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు ఆధ్వర్యంలో ఆదివారం గొర్లపల్లి వద్ద ఉన్న ఎడమ కాలువ వద్దకు వెళ్లారు. పరిస్థితిని సమీక్షించి మీటర్‌నర లోతు ఉన్న మట్టి, తుంగ, పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించారు. బురద కారణంగా జేసీబీ దిగబడుతుండటంతో పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. రెండు రోజుల్లో పూడిక తీత పూర్తి చేయిస్తామని అధికారులు తెలిపారు. పొలాలకు సాగునీరు ఇచ్చేలా చొరవ చూపిన ‘సాక్షి’, ఇరిగేషన్ కాంట్రాక్ట్ సిబ్బందికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



జేసీబీతో పూడిక తీయిస్తున్న అధికారులు, రైతులు

‘మత్స్యకారులను పట్టించుకోని ప్రభుత్వాలు’

పాతమంచిర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించాయని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లేల బాలకృష్ణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవన్‌లో మత్స్య కార్మిక సంఘం నాయకుడు బోడెంకి మహేశ్ ఆధ్వర్యంలో ముఖ్య బాధ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు గానీ, ప్రస్తుత ప్రభుత్వాలుగానీ, మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడం లేదని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని కోరారు. వడ్డీలేని రుణం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ చెల్లించాలని, మండల, జిల్లా కేంద్రాల్లో ఫిష్ మార్కెట్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండె ప్రమీళ, తుమ్మ రేణుక, రమాదేవి, పద్మ, పానెం రాజన్న, రాజేశ్, శ్రీనివాస్, మహేశ్, శ్రీనివాస్ ఆశన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన సూపర్ బజార్

• రెండు వారాలుగా తెరుచుకోని సింగరేణి దుకాణం
• ఉద్యోగుల కొరతే కారణం

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని నస్పూర్ షిర్కే కాలనీలో ఉన్న సూపర్ బజార్ కొద్ది రోజులుగా తెరుచుకోవడం లేదు. రెండు వారాలుగా ఈ దుకాణం మూసే ఉంటుందని కార్మికులు తెలిపారు. కంపెనీలోనే అతిపెద్ద ఏరియాలో సూపర్‌బజార్ మూత పడడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. కాలనీల మధ్య ఉన్న ఈ సూపర్ బజార్‌లో నిత్యావసర సరుకులు, ఇతర గృహోపకరణాలు సరమైన ధరలకు ఇక్కడ లభిస్తాయి. నగదుతోపాటు కార్మికులకు ఇక్కడ క్రెడిట్ పద్ధతిలో కూడా సరుకులు ఇస్తారు. నెల తర్వాత ఈ డబ్బులను వారి వేతనం నుంచి రికవరీ చేసే వెసులుబాటు ఉంది. దీంతో కార్మిక కుటుంబాలు నెలాఖరున, డబ్బులకు ఇబ్బంది ఉన్న సమయంలో ఉద్దెరపై సరుకులు తీసుకెళ్తారు. రెండు వారాలుగా దుకాణం మూసి ఉండడంతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.



మూసి ఉన్న సింగరేణి సూపర్ బజార్

సొసైటీ పేరిట నిర్వహణ..

సింగరేణిలో కార్మిక కుటుంబాలకు వంట గ్యాస్, నిత్యావసర సరుకులు అందించడం కోసం ప్రత్యేక సొసైటీ ఉంటుంది. సింగరేణి కాలరీస్ కోఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ పేరుతో సొసైటీ ద్వారా ఈ సేవలు అందిస్తారు. ఇందులో పనిచేసే ఉద్యోగుల వేతనాలు, వారి పేరోల్ అన్నీ కంపెనీలో పనిచేసే ఇతర రెగ్యులర్ కార్మికులకు భిన్నంగా వీరికి ఉంటుంది. గతంలో కంపెనీ వ్యాప్తంగా ఈ సొసైటీలో 150 మంది పర్మినెంట్ ఉద్యోగులు పనిచేసేవారు. కాలక్రమేనా రిటైర్ అయిన వారిస్థానంలో కొత్తవారిని తీసుకోలేదు. ఆర్థిక సంస్కరణలో భాగంగా అన్నింటిలో కొత్త పెడుతున్న యాజమాన్యం ఈ సొసైటీల సేవలను కూడా కుదించాలనే ఆలోచనలో కొత్త రిక్రూట్‌మెంట్ చేపట్టడంలేదు. దీంతో మ్యాన్‌పవర్ తగ్గుతూ వస్తుంది. నస్పూర్ షిర్కే కాలనీలోని సూపర్‌బజార్‌లో ఒక పర్మినెంట్ సొసైటీ ఉద్యోగితోపాటు మరో ఇద్దరు డైలీ రేటెడ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కౌంటర్‌పై పనిచేసే పర్మినెంట్ ఉద్యోగి ఫిబ్రవరి 28న రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో దుకాణం మూసి ఉంటుంది. సిబ్బంది కొరత కారణంగానే సూపర్‌బజార్ తెరవడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

త్వరలో ఓపెన్ చేస్తాం

సిబ్బంది కొరత కారణంగానే సూపర్‌బజార్ తెరవడం లేదు. ఇక్కడ పనిచేసే ఉద్యోగి రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త వారిని తీసుకోవాల్సి ఉంది. త్వరలోనే సిబ్బందిని సర్దుబాటు చేసి సూపర్ బజార్ తెరుస్తాం. కార్మికులకు సరుకులు అందిస్తాం.

– పాలకుర్తి రాజు, డీఎం, సూపర్ బజార్స్

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి సన్మానం

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఇటీవల విజయం సాధించిన అంజిరెడ్డిని జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించడంతోనే బీజేపీకి ప్రజల మద్దతు ఉందని నిరూపితమైందన్నారు. పట్టభద్రులు తనపై ఎంతో నమ్మకంతో ఓటు వేసి గెలిపించారని, వారి తరఫున మండలిలో మాట్లాడి, పట్టభద్రుల సమస్యలపై పోరాడుతానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూని వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, ముల్కల్ల మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముకేశ్‌గౌడ్, తుల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, పెద్దపల్లి పురుషోత్తం పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

క్లుప్తంగా

భైంసాలో బాలిక ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని పులేనగర్‌కు చెందిన కదం కోమలి (13) అనే విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారి సమాచారం మేరకు 108 సిబ్బంది చేరుకుని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పుస్తెలతాడు చోరీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్‌కు చెందిన కొత్త శ్యామల ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆదివారం ఉదయం గుర్తు తెలియని మహిళ మాస్క్ ధరించి ఇంట్లో చొరబడి శ్యామలను బాత్‌రూంలోకి నెట్టి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడు లాక్కుని పారిపోయిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసర గోదావరిలో మృతదేహం

బాసర: నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదిలో ఆదివారం గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి దిగువకు వరదనీరు చేరుకోవడంతో మృతదేహం గోదావరి ప్రవాహంలో ఇక్కడికి కొట్టుకువచ్చిందా? లేదా ఇక్కడికే వచ్చి ఎవరైనా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మంచిర్యాల వద్ద..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోదావరిలో పెద్దపల్లి జిల్లా అతర్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (40)మృతదేహం లభించినట్లు ఎస్సై వెంకట్ తెలిపారు. గోదావరి మధ్యలో నీటి మడుగులో సుమారు మూడు నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లుగా ఉందని పేర్కొన్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా కుళ్లిపోయి ఉందని తెలిపారు. మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవని, చుట్టుపక్కల ఆనవాళ్లు లభించలేదని వెల్లడించారు. మృతుడు మంచిర్యాల లేదా నస్పూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు. వివరాలకు 8712656527 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పట్టుబట్టి.. కొలువు కొట్టి..

- గ్రూప్–1, 2, 3 ఉద్యోగాలకు ఉమ్మడి జిల్లావాసులు ఎంపిక
- ఉద్యోగాలు చేస్తూనే రాష్ట్రస్థాయి ర్యాంకులు
- కోచింగ్ లేకుండానే సత్తా చాటిన వైనం..

టీజీపీఎస్సీ ఇటీవల ప్రకటించిన గ్రూప్–1, 2, 3 ఫలితాల్లో ఉమ్మడి జిల్లావాసులు సత్తా చాటారు. ఉన్నత స్థాయి కొలువు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు ఆ మేరకు కష్టపడ్డారు. కొందరు ఉద్యోగాలు చేస్తూనే ‘గ్రూప్’ కొలువులకు ఎంపిక కాగా, మరికొందరు ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతంగానే చదివి సత్తా చాటారు. ఇంకొందరు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సహకారం, ప్రోత్సాహం, స్ఫూర్తితో ఉద్యోగాలు సాధించారు. ఉమ్మడి జిల్లా నుంచి సర్కారు కొలువులకు ఎంపికైన పలువురి సక్సెస్ వారి మాటల్లో..



తల్లి రమక్కతో చీర్ల సురేశ్‌రెడ్డి

కష్టపడితే కొలువు సులువే

నెన్నెల: ప్రభుత్వ కొలువు సాధించాలనే పట్టుదల, ప్రణాళికాబద్ధంగా చదివితే ప్రభుత్వ కొలువు సాధించడం సులువే అంటున్నారు గ్రూప్–2 55వ ర్యాంకర్ చీర్ల సురేశ్‌రెడ్డి. నెన్నెల మండలం ఆవుడం గ్రామానికి చెందిన చీర్ల లక్ష్మయ్య–రమక్క దంపతుల మూడో కుమారుడు సురేశ్‌రెడ్డి ‘సాక్షి’తో మాట్లాడారు. తమది వ్యవసాయ కుటుంబమని, తాను ఇంటర్‌లో ఉన్నప్పుడే తండ్రి చనిపోయాడని తెలిపారు. అమ్మ, అన్న కిషన్‌రెడ్డి ప్రోత్సాహంతో గ్రూప్–2లో ర్యాంకు సాధించానని తెలిపారు. పదో తరగతి వరకు ఆవుడం ప్రభుత్వ పాఠశాలలో చదివానని, బీటెక్ విశాఖపట్నంలో అభ్యసించినట్లు వెల్లడించారు. ఎలాంటి కోచింగ్ లేకుండా మొదట కానిస్టేబుల్, అనంతరం ఎన్‌పీడీఎల్, సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ కొలువులు సాధించానని వెల్లడించారు. గ్రూపు–2లో ర్యాంకు సాధించేందుకు రోజుకు 8 గంటలు హైదరాబాద్‌లోని ప్రైవేట్ లైబ్రరీలో చదివానని తెలిపారు. ఎలాంటి కోచింగ్ తీసుకోలేదని, సొంతంగా నోట్స్ తయారు చేసుకుని ప్రిపేర్ అయ్యానని చెప్పారు. ఎన్‌సీఈఆర్టీ, తెలుగు అకాడమీకి సంబంధించిన వివిధ రకాల స్టాండర్డ్ టెక్ట్స్ బుక్స్ చదివానని వెల్లడించారు. గ్రూపు–3లో కూడా రాష్ట్రస్థాయిలో 48వ ర్యాంకు వచ్చిందని తెలిపారు. గ్రూపు–1 ర్యాంకు సాధించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.

కోచింగ్ లేకుండా కొలువు..

నెన్నెల: ‘పబ్లిక్ సర్వీస్ చేయాలనే లక్ష్యంతో గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతంగా ప్రిపేర్ అయ్యాను. గ్రూపు–2లో రాష్ట్రస్థాయిలో 172వ ర్యాంకు సాధించాను’ అని తెలిపాడు. నెన్నెల మండలం ఆవుడం గ్రామానికి చెందిన మండల సుమంత్ గౌడ్. మండల మురళిగౌడ్–ఉషారాణి దంపతుల కుమారుడు సుమంత్‌గౌడ్ పదో తరగతి వరకు మంచిర్యాల కృష్ణవేణి టాలెంట్‌స్కూల్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివాడు. ధన్‌బాద్‌లో ఐఐటీలో మైనింగ్ ఇంజినీర్ పూర్తిచేసి ఐదేళ్లుగా ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. జాబ్ చేస్తూనే గ్రూపు–4లో రాష్ట్రస్థాయిలో 88వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్‌సీఈఆర్‌టీ టెక్ట్‌బుక్స్, తెలుగు అకాడమీ వివిధ రకాల పుస్తకాల ద్వారా హైదరాబాద్‌లో స్టడీ హాల్‌లో రోజుకు పది గంటలు చదివి ప్రిపేర్ అయ్యారు. పట్టుదలతో, అమ్మ నాన్నల ప్రోత్సాహంతోనే తాను గ్రూప్–2 ర్యాంకు సాధించానని వెల్లడించారు.



తల్లిదండ్రులతో సుమంత్‌గౌడ్

ప్రణాళిక, లక్ష్యంతోనే విజయం

కౌటాల: అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రణాళిక, లక్ష్యంతోనే విజయం సాధించవచ్చని నిరూపిస్తున్నాడు కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన మండల సాయిరాం గౌడ్. తండ్రి రాజేశ్వంగౌడ్ వృత్తిరీత్యా గీత కార్మికుడు కాగా తల్లి తారక్క గృహిణి. పదోతరగతి వరకు కౌటాలలో, ఇంటర్ హన్మకొండలో, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. ప్రతీరోజు వార్తా పత్రికలు, ప్రామాణిక పుస్తకాలు చదవడం, ప్రభుత్వ వైబ్‌సైట్‌లో విషయాలు తెలుసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానన్నారు. తెలుగు అకాడమీ, ఇతర ప్రైవేటు పుస్తకాలు, కరంట్ అఫైర్స్‌కు ‘సాక్షి’ దినపత్రికతో పాటు పలు మ్యాగజైన్లపై ఆధారపడ్డానన్నారు. పత్రికల్లో ఎడిటోరియల్ చదవడం ద్వారా అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెంచుకున్నానన్నారు. చదువుకునే సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డానని, అక్కా, బావ, మిత్రులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. 2019 ఏప్రిల్‌లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించానన్నారు. అందరి సహకారంతోనే గ్రూప్స్ పరీక్షల్లో విజయం సాధించానని తెలిపారు. సివిల్స్ సాధించాలనే లక్ష్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం గ్రూప్ 1 సాధించాలని లక్ష్యంగా ఏర్పరుచుకున్నానన్నారు.



తల్లిదండ్రులతో సాయిరాంగౌడ్

ఆదర్శం.. అశోక్‌కుమార్

తాంసి: సివిల్స్ లక్ష్యంగా ప్రిపరేషన్ మొదలు పెట్టి గ్రూప్–1,2,3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలోనే అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నాడు తాంసి మండల కేంద్రానికి చెందిన జానకొండ అశోక్ కుమార్. ప్రస్తుతం సాత్నాల మండలం సుందరగిరి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. 2014న కార్యదర్శిగా ఎంపికైన ఈయన సివిల్స్ లక్ష్యంగా ప్రిపరేషన్ కొనసాగించాడు. ఈ క్రమంలో 2016లో సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లాడు. అయితే త్రుటిలో కొలువు చేజారింది. అయినా నిరాశ చెందకుండా గ్రూప్స్‌పై దృష్టి సారించాడు. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన గ్రూప్స్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. గ్రూప్–1లో 399 మార్కులు సాధించగా, గ్రూప్–2లో రాష్ట్రస్థాయిలో 250వ ర్యాంకు, అలాగే గ్రూప్–3లో రాష్ట్రస్థాయిలో 417వ ర్యాంకుతో సత్తా చాటాడు.



కుటుంబసభ్యులతో అశోక్‌కుమార్

రోజుకు పది గంటలు చదివా..



ప్రిపరేషన్‌లో భాగంగా ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకున్నా. తెలుగు అకాడమీ పుస్తకాలనే ప్రామాణికంగా చేసుకున్నా. రోజుకు ఎనిమిది నుంచి పదిగంటల వరకు చదివేవాన్ని. సొంతంగానే నోట్స్ ప్రిపేర్ చేసకున్నా. ఆన్‌లైన్‌లో అశోక్ సార్ క్లాసులు ఫాలో అయ్యా. అలాగే తెలంగాణ ఉద్యమం సంబంధించి వి.ప్రకాశ్ సార్ బుక్స్ కూడా చదివాను. ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు భగవద్గీత, పంచతంత్ర కథలను చదివాను. కుటుంబ సభ్యులు కూడా పూర్తి స్థాయిలో సహకరించడంతోనే ఇది సాధ్యమైంది.

యూపీఎస్సీ టార్గెట్..

మంచిర్యాలరూరల్(హాజీపూర్):ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో 2016 నుంచి యూపీఎస్సీ సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగుతూ గ్రూప్ పరీక్షల్లోనూ విజేతగా నిలిచాడు మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన లెక్కల శ్రావణ్‌కుమార్. శ్రావణ్‌కుమార్ తండ్రి లింగయ్య విశ్రాంత సింగరేణి ఉద్యోగి. తల్లి కళావతి గృహిణి. అక్క స్రవంతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. చెల్లె స్వర్ణలత డీఎస్సీకి సమాయత్తం అవుతోంది. శ్రావణ్‌కుమార్ భార్య సౌమ్య గృహిణి. వీరికి కూతురు స్నిగ్ధశ్రీ, కుమారుడు వేదంశ్‌కృష్ణ ఉన్నారు. ఇంటర్ వరకు మంచిర్యాలలో చదివి, బీటెక్ ఈసీఈ హైదరాబాద్‌లో చదివాడు. 2016 నుంచి యూపీఎస్సీకి సమాయత్తం అవుతుండగా, 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించాడు. అయితే యూపీఎస్సీపై దృష్టి పెట్టాలని ఉద్యోగాన్ని వదులుకున్నాడు. 2022లో మొదటిసారి యూపీఎస్సీ పరీక్ష రాయగా, ప్రిలిమ్స్‌లో విజయం సాధించినా 4 మార్కులతో మెయిన్స్ కోల్పోయాడు. ఈ క్రమంలోనే వరసగా గ్రూప్స్ నోటిఫికేషన్‌లు వెలువడటంతో అన్ని పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. గ్రూప్స్ పరీక్షలకు ఎలాంటి కోచింగ్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి చదివాడు. గ్రూప్–4లో జిల్లా స్థాయిలో 11వ ర్యాంకు సాధించి బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గ్రూప్–3లో రాష్ట్ర స్థాయిలో 39 ర్యాంక్ సాధించాడు. గ్రూప్–2లో రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 15వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్–1లోనూ 404 మార్కులతో అర్హత సాధించగా ర్యాంకులు ప్రకటిస్తే మంచి ర్యాంకు వస్తుందని ఆశగానే ఎదురు చూస్తున్నాడు.



లెక్కల శ్రావణ్‌కుమార్, గుడిపేట

సింగరేణి సీఎండీ ప్రోత్సాహం.. అమ్మానాన్నల ఆశీర్వాదం

- గ్రూప్–1 సాధించడమే నా డ్రీమ్
- కోచింగ్ సెంటర్‌కు వెళ్లకుండానే..

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రానికి చెందిన శ్రీరాం సత్యనారాయణ, వాణిశ్రీ దంపతుల కుమారుడు శివకృష్ణ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలోనే 19వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సింగరేణి సీఎండీ బలరాం ప్రోత్సాహం, అమ్మానాన్నల ఆశీర్వాదంతో విజయం సాధించానన్నారు. తన సక్సెస్‌కు కారణాలు, అనుభవాలు ‘సాక్షి’తో పంచుకున్నారు. ఒకటవ తరగతి నుంచి పదోతరగతి వరకు జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో చదువుకున్నానన్నారు. 2014లో బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్‌లో చేరానని, 2021లో ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం సాధించి నెలకు రూ.50 వేల వేతనం పొందానన్నారు. 2022లో సింగరేణి నిర్వహించిన పరీక్షల్లో పాసై జాబ్ సంపాదించా. ఆ సమయంలో సీఎండీ బలరాం నేను జీవితంలో ఉన్నతస్థాయికి చేరేందుకు ఎంతగానో ప్రోత్సహించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఒక్కోమెట్టు ఎక్కుతున్నా. జాబ్ చేస్తున్న సమయంలోనే 2023లో గ్రూప్–4లో రాష్ట్రస్థాయిలో ప్రథమర్యాంకు సాధించానన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ ఆడిట్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నానన్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్–3లో రాష్ట్రంలో 12వ ర్యాంకు సాధించగా తర్వాత విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 19వ ర్యాంకు, జోనల్‌లో 4వ ర్యాంకు సాధించి తన లక్ష్యానికి చేరువవుతున్నానన్నారు. ఏ కోచింగ్ సెంటర్‌కు వెళ్లకుండా ఇంటివద్దే ఉండి ఆన్‌లైన్‌లో తీసుకున్న పుస్తకాలనే చదువుతున్నానన్నారు.



తల్లిదండ్రులతో శ్రీరాం శివకృష్ణ

సింగరేణి ఉద్యోగం చేస్తూ..

రెబ్బెన(ఆసిఫాబాద్): డిగ్రీ పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ వైపు విప్రోలో ఉద్యోగం సాధించా. కానీ ఎప్పుడూ కంప్యూటర్‌తోనే ఉండాల్సి వచ్చేది. ఎక్కడో చిన్న వెలితి. ప్రజలతో మమేకమై వారికి నేరుగా సేవలు అందించాలంటే గ్రూప్స్ కరెక్ట్ అనిపించింది. దీంతో సాఫ్ట్‌వేర్ జాబ్ వదిలేసి గ్రూప్స్ కోసం ప్రిపరేషన్ మొదలుపెట్టా. చివరికి అనుకున్నది సాధించగలిగా.. అని గ్రూప్–2 రాష్ట్రస్థాయి 229 ర్యాంకర్ కామ్రే భాస్కర్ పేర్కొన్నారు. గ్రూప్–2లో సాధించిన విజయం సాధించేందుకు కష్టపడిన తీరుపై సాక్షి పలకరించగా ఆయన మాటల్లోనే... మాది కౌటాల మండలంలోని గుడ్లబోరి అనే చిన్నగ్రామం. అమ్మానాన్న లాహనుబాయి, రావూజీ. 1 నుండి పదోతరగతి వరకు మా ఊరికి సమీపంలోని విజయనగరంలో, ఇంటర్ ముథోల్ గురుకుల కళాశాలలో, డిగ్రీ హనుమకొండలో పూర్తిచేశా. గ్రూప్–2 సాధించాలనే లక్ష్యంతో ప్రిపరేషన్ మొదలుపెట్టా. 2016లో మొదటి ప్రయత్నంలో గ్రూప్–2లో ఆశించిన ర్యాంకు రాలేదు. అదే సంవత్సరంలో సింగరేణిలో క్లర్క్ ఉద్యోగం కోసం నోటిఫికేషన్ విడుదల చేయడంతో పరీక్ష రాయగా జూనియర్ అసిస్టెంట్‌గా జాబ్ వచ్చింది. బెల్లంపల్లి ఏరియాలోని డోర్లిలో విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్ కోసం ప్రిపరేషన్ కొనసాగించా. ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకున్నా. సింగరేణి ఆధ్వర్యంలోని గోలేటి లైబ్రరీ నాకు బాగా ఉపయోగపడింది. కష్టానికి ఫలితంగా గ్రూప్–2లో 381.06 మార్కులతో రాష్ట్రస్థాయిలో 229 ర్యాంకు వచ్చింది. గ్రూప్–1 సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. నా ప్రతీ విజయంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుంది. గ్రూప్–3లోనూ 296 మార్కులతో రాష్ట్రస్థాయిలో 154వ ర్యాంకు వచ్చింది. అయితే గ్రూప్–2 జాబ్‌లోనే జాయిన్ అవుతా.



కుటుంబ సభ్యులతో కామ్రే భాస్కర్

ఐదు ఉద్యోగాలు సాధించిన తేజశ్రీరెడ్డి

తలమడుగు: పోటీ ప్రపంచంలో ఒక్క ఉద్యోగం సాధించడమే గగనమైన తరుణంలో ఏకంగా ఐదు ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు తలమడుగు మండలం సుంకిడి గ్రామనికి చెందిన తేజశ్రీ రెడ్డి. తాజాగా విడుదలైన గ్రూప్–2,3లోనూ ప్రతిభ కనబరిచారు. నిరంతర ప్రిపరేషనే తన విజయ రహస్యమని చెబుతున్నారు ఈమె.

ఏడేళ్లుగా ప్రిపరేషన్‌లోనే..

2018 నుంచి నా ప్రిపరేషన్ మొదలు పెట్టా. రోజుకు 12 నుంచి 14 గంటలు చదివాను. కొంత కాలం హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నా. తర్వాత ఇంటి వద్దే ప్రిపేర్ అయ్యాను. 2018లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యాను. 2019లో అటవీశాఖలో బీట్ ఆఫీసర్‌గా సెలక్టయ్యా. 2024లో గ్రూప్–4లో వాణిజ్య పన్నుల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఆదిలాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నా. తాజాగా గ్రూప్–2లో బాసర జోన్‌లో మహిళా విభాగంలో మొదటి ర్యాంకు, గ్రూప్–3లో రాష్ట్రస్థాయిలో 190వ ర్యాంకు సాధించా. భర్త సాత్విక్ రెడ్డి ప్రోత్సాహం, కుటంబ సభ్యుల సహకారంతోనే ఇన్ని ఉద్యోగాలు సాధించగలిగాను.



భర్త సాత్విక్‌రెడ్డితో తేజశ్రీరెడ్డి

ప్రణాళికతో విజయం..

నస్పూర్:గ్రూప్స్ స్థాయి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉద్యోగం చేస్తూనే టార్గెట్ రీచ్ అయ్యాడు పోలంపల్లి వెంకటేశ్. గ్రూప్–2లో 337వ ర్యాంకు, గ్రూప్–3లో 181వ ర్యాకు సాధించాడు. హాజీపూర్ మండలం టీకన్నపల్లి గ్రామానికి చెందిన పోలంపల్లి లక్ష్మి–రాజలింగు దంపతుల కుమారుడు వెంకటేశ్. సబ్బపల్లి జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. మంచిర్యాలలో ఇంటర్, హైదరాబాద్ నిజాం కాలేజీలో డిగ్రీ చదివాడు. 2014లో నిర్వహించిన వీఆర్‌వో పరీక్షలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్‌గా నిలిచాడు. నస్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోగా విధులు నిర్వహించాడు. అనంతరం లక్సెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ గ్రూప్ పరీక్షలకు సిద్ధమయ్యాడు. పరీక్షల సమయంలో 45 రోజులు ఉద్యోగానికి సెలవు పెట్టి పరీక్షలపై దృష్టి పెట్టాడు. ఎస్జీటీ ఉపాధ్యాయుడు దండెవేమి మల్లేశ్ హనీ జీఎస్ పేరుతో యూట్యూబ్‌లో ప్రసారం చేసిన కరెంట్ ఎఫైర్స్ రెగ్యులర్‌గా ఫాలో అయ్యాడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గ్రూప్–2, 3లో ఉత్తమ ర్యాంకు సాధించాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. నిర్మల్ జిల్లాలో ఇద్దరు, మంచిర్యాల జిల్లాలో ఒకరిని మృత్యువు కబళించింది.

తానూర్‌లో..

తానూరు: మండల కేంద్రం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుభీ ర్ గ్రామానికి చెందిన సగ్గం నరేశ్ (36) అ క్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై శ్రీని వాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్ గ్రామానికి చెందిన నరేశ్ ఆదివారం ఉదయం పని నిమిత్తం తానూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. తానూరు సమీపంలోని డాంగేపల్లి వంతెన వద్ద ముందున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నరేశ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ముందు ద్విచక్రవాహనంపై వెళ్తున్న హిప్నెల్లితండాకు చెందిన విద్యార్థిని సుజాత కుడి కాలుకు గాయాలయ్యాయి. సుజాత అన్న పవార్ సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడ్తాల్‌లో జాతీయ రహదారిపై..

లక్ష్మణచాంద(సోన్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన సోన్ మండలంలోని కడ్తాల్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన సాయినాథ్ (30) ఆదివారం ద్విచక్రవాహనంపై సోన్ మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా సోన్ మండలంలోని కడ్తాల్ వద్ద జాతీయ రహదారిపై ట్రాక్టర్ షోరూం సమీపాన హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సాయినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సాయినాథ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుడిపేట వద్ద...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జంజిరాల ఫణీంద్రవర్మ(26) మృతి చెందాడు. దండేపల్లి మండలం మామిడిపల్లికి చెందిన ఫణీంద్రవర్మ మంచిర్యాలలోని ఓ వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా, లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముల్కల్ల సమీపంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఫణీంద్రవర్మ అక్కడికక్కడే మృతిచెందాడు. ఫణీంద్రవర్మకు తల్లి హంస, తండ్రి పెద్దయ్య, సోదరుడు నాగేంద్రవర్మ, సోదరి నైనిక ఉన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వివాహిత అంగడి మమత(35) ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన అంగడి మల్లేశ్, జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మమతకు 15 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి 13 ఏళ్ల కూతురు ఉంది. మల్లేశ్‌కు కొన్ని రోజులుగా మతిస్థిమితం సక్రమంగా ఉండడం లేదు. అప్పులు అమ్ముతున్నాడు. ఈ విషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మమత శనివారం రాత్రి నిద్రపోయింది. ఆదివారం ఉదయానికి చనిపోయి ఉంది. దీంతో గుండెపోటుతో మరణించిందని పుట్టింటివారికి సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న మమత సోదరి మౌనిక మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. మమత గుండెపోటుతో మరణించిందని మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మౌనిక మాత్రం హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ఆసుపత్రికి తరలించారు.

చేపలు వేటకు వెళ్లి శవమయ్యారు



సాయన్న (ఫైల్)

సోన్: చేపలు పట్టడానికి వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన సోన్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. సోన్ మండల కేంద్రానికి చెందిన గుమ్ముల సాయన్న (48) ఎప్పటిలాగే శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని గోదావరిలోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో సాయన్న కోసం కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో సోన్ పాత బ్రిడ్జికి సమీపంలోని ఒక నీటి మడుగులో కాళ్లకు చేపల వల చుట్టుకొని వ్యక్తి చనిపోయి ఉన్నాడని అటుగా వెళ్లినవారు గుర్తించి గ్రామస్తులకు తెలిపారు. దీంతో అక్కడకు వెళ్లి చూడగా సాయన్న చేపలు పడుతూ ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి చనిపోయినట్లు తెలిసింది. మృతుడి భార్య లింగవ్వ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దిలావర్‌పూర్‌లో మరొకరు..

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన గూండ్ల నడిపి పోశెట్టి (46) ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోశెట్టి శనివారం స్థానిక కొత్త చెరువు వద్దకు వల తీసుకువెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఆదివారం కొత్త చెరువులో మృతి చెంది ఉండడాన్ని బంధువులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బొగ్గు వేలంలో పాల్గొనాలి

- ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: బొగ్గు వేలంలో సింగరేణి పాల్గొనాలని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్ తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన చట్టం ప్రకారం వేలంలో పాల్గొంటేనే సింగరేణికి గనులు వచ్చే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో సింగరేణిలో నేడు కొత్త గనులు లేక సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. సింగరేణికి భవిష్యత్ ఉండాలంటే వేలంలో పాల్గొనాలన్నారు. ఇటీవల జరిగిన స్ట్రక్చరల్, జేసీసీ సమావేశంలో కార్మికుల ప్రధాన డిమాండ్లపై యజమాన్యం పూర్తి నిర్ణయం తీసుకోకుండా కమిటీలు వేసిందన్నారు. ఈ కమిటీలతో కాలయాపనే జరుగుతుందన్నారు. కార్మికుల సొంత ఇంటి పథకం, అలవెన్సులపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్ వంటి ప్రధాన డిమాండ్లు ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్నాయన్నారు. దీనిపై నిర్ణయాలకు కంపెనీ ప్రభుత్వ నిర్ణయం మీదనే ఆధారపడుతుందని పేర్కొన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని తెలిపారు.సమావేశంలో యూనియన్ సీనియర్ ఉపాధ్యక్షుడు, కనీస వేతనాల సలహా మండలి సభ్యులు నర్సింహారెడ్డి, కాంపెల్లి సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు గరిగె స్వామి, కలవేని శ్యాం, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆదివారం విద్యాసంస్థలకు సెలవు కావడంతోపాటు శుభ ముహూర్తం ఉండటంతో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. అమ్మవారి దర్శనం అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కుంకుమార్చన తదితర పూజలు జరిపించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో అమ్మవారి దర్శనానికి ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి పాదాల చెంత పెన్నులు, పరీక్ష ప్యాడ్లు ఉంచి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు తెలిపారు.



దర్శనం కోసం క్యూలో భక్తులు